నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శుక్రవారం 29 మార్చి 2024 | KAMAREDDY

జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు

కంఠేశ్వర్, మార్చి 28: లోక్‌సభ ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున జిల్లా గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు గురువారం తెలిపారు.ఈ కమిటీకి అదనపు కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. తనిఖీల్లో రూ. 50వేల కన్నా ఎక్కువగా నగదు, బంగారం, వెండి ఉండి సరైన ఆధారాలు చూపకుంటే వాటిని తనిఖీ అధికారులు జప్తు చేస్తారని పేర్కొన్నారు.జప్తు చేసిన నగదు, బంగారం, వెండి వస్తువులు రూ. లక్ష లోపు ఉండి తగిన ఆధారాలు చూపిన పక్షంలో వాటిని విడుదల చేయడానికి జిల్లా గ్రీవెన్స్‌కమిటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు మూడుకేసులు నమోదు చేశామని తెలిపారు. ఇందులో ఒక కేసు రూ. 50వేలకు తగిన ఆధారాలు చూపించడంతో గ్రీవెన్స్ కమిటీ ఆ మొత్తాన్ని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. తెలియక ప్రయాణించినా తనిఖీలో నగదు, ఇతర విలువైన వస్తువులను జప్తు చేస్తే ఆందోళన చెందకుండా సరైన ధ్రువపత్రాలతో కలెక్టరేట్‌లోని జిల్లా గ్రీవెన్స్ కమిటీని లేదా సెల్ 7997590472 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు

కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలి

కామారెడ్డి, మార్చి 28: జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సజావుగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో యాసంగి సీజన్ (2023-2024) ధాన్యం కొనుగోళ్లపై కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలకోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరిస్తూ కొనుగోలు కేంద్రాలను అధికారులు, ఆయా శాఖల బాధ్యులు మాత్రమే ప్రారంభించాలని సూచించారు. ఎక్కడా కూడా ప్రజాప్రతినిధులను ఆహ్వానించరాదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయం కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకే విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ 'ఏ' రకం ధాన్యానికి రూ.2,203, బీ గ్రేడ్ రకానికి రూ.2,183 నిర్ణయించినట్లు తెలిపారు. యాసంగి సీజన్ కోతలు మొదలైన దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని మండలాల్లో ఏప్రిల్ 1 నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. వ్యవసాయ శాఖ అంచనాల మేరకు జిల్లాలో యాసంగి సీజన్‌లో దాదాపు 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానున్నదని తెలిపారు. ధాన్యాన్ని సేకరించేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో 326, ఐకేపీ ఆధ్వర్యంలో 22 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

రామారెడ్డి ఠాణాలో వ్యక్తి వీరంగం

అర్ధరాత్రి సిబ్బందిపై దాడి

రామారెడ్డి, మార్చి 28: పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తి బుధవారం అర్ధరాత్రి వీరంగం సృష్టించాడు. సిబ్బందిపై కత్తితో దాడికి పాల్పడిన ఘటన కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలకేంద్రంలో చోటుచేసుకున్నది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెదిన బిట్ల రవి బుధవారం అర్ధరాత్రి తన తండ్రి శంకర్‌తో గొడవపడ్డాడు. దీంతో అతని తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కానిస్టేబుల్ సిద్ధరాములకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న రవి.. ఠాణాకు వెళ్లి వీరంగం సృష్టించాడు. తలుపులు, కిటికీ అద్దాలను ధ్వంసం చేయయంతోపాటు కానిస్టేబుల్ సిద్ధరాములుపై కత్తితో దాడి చేశాడు. అక్కడే ఉన్న ఏఎస్సై రవీందర్, కానిస్టేబుల్ గణేశ్ అడ్డుపడడంతో వారిని కూడా దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డాడు. చుట్టుపక్కల ఉన్నవారు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకొని రవిని పట్టుకున్నారు. ఈ ఘటనపై ఎస్సై విజయ్ కేసు నమోదు చేయగా, కామారెడ్డి రూరల్ సీఐ రామన్ రిమాండ్‌కు తరలించారు.

రగిలిపోతున్న బీసీలు..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోనూ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సామాజిక సమతూకాన్ని పాటించలేదన్న అభిప్రాయం సొంత పార్టీలోనే నెలకొన్నది. కామారెడ్డి నుంచి పీసీసీ చీఫ్, నేటి సీఎం రేవంత్ రెడ్డి పోటీ చేశారు. ఎల్లారెడ్డి నుంచి మదన్‌మోహన్, బాన్సువాడ నుంచి ఏనుగు రవీందర్ రెడ్డి, బోధన్ నుంచి సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ నుంచి భూపతిరెడ్డి, బాల్కొండ నుంచి సునీల్‌రెడ్డి, ఆర్మూర్ నుంచి వినయ్ రెడ్డి ఇలా అంతా అగ్రవర్ణాలకు చెందిన వారికే పెద్ద పీట వేశారు. నిజామాబాద్ అర్బన్ మాత్రమే అకస్మాత్తుగా మైనార్టీకి కేటాయించారు. జుక్కల్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడ్ కావడంతో ఇక్కడ గత్యంతరం లేక అదే సామాజిక వర్గానికి చెందిన వారిని కాంగ్రెస్ పోటీకి దింపింది. మిగిలిన 7 స్థానాల్లో ఆరుగురు రెడ్లు, ఒకరు వెలమ సామాజిక వర్గానికి చెందిన వారిని బరిలోకి దింపింది. అప్పటికప్పుడు పార్టీలు మారిన వారికి ప్రాధాన్యతను కల్పించారు. ఏనుగు రవీందర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి ఎన్నికలకు కొద్దిరోజుల ముందే కండువా కప్పుకోగా, టికెట్లు కేటాయించారు. బీసీల్లో బలమైన సామాజిక వర్గంగా గుర్తింపు పొందిన మున్నూరుకాపులు, పద్మశాలీలు, ముదిరాజ్‌లకు కనీసం ఎక్కడా చోటు కల్పించలేదు. మరోవైపు, నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోకి వచ్చే జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ సీట్లను సైతం అగ్రవర్ణాలకే కేటాయించారు. లోక్‌సభ ఎన్నికల్లోనైనా తప్పనిసరిగా బీసీలకు ఏఐసీసీ ప్రాధాన్యం ఇస్తుందని చాలా మంది కాంగ్రెస్ నేతలు ఆశించారు. అందుకు విరుద్ధంగా జరగడంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన వారంతా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



మరోసారి వంచించిన కాంగ్రెస్

బీసీలకు మొండిచేయి

- నిజామాబాద్ టికెట్ జీవన్‌రెడ్డికి కేటాయింపు
- వెనుకబడిన వర్గాలపై మొదటి నుంచే చిన్నచూపు
- మున్నూరుకాపులు, పద్మశాలీలకు రిక్త'హస్తం'
- చివరి దాకా ప్రయత్నించినా పట్టించుకోని అధిష్టానం
- అసెంబ్లీ ఎన్నికల్లోనూ అగ్రవర్ణాలకే పెద్దపీట
- అంతర్గతంగా కుమిలిపోతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీ మరోసారి వెనుకబడిన వర్గాలకు మొండి'చేయి' చూపింది. బీసీలంటే మొదటి నుంచి చిన్నచూపు చూస్తున్న ఆ పార్టీ నాయకత్వం మళ్లీ అన్యాయం చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు అరకొరగా సీట్లు కేటాయించిన అధికార పార్టీ.. నిజామాబాద్ లోక్‌సభ టికెట్ కేటాయింపులోనూ రిక్త'హస్తమే' చూపింది. వెనుకబడిన వర్గాలకు చెందిన ముఖ్య నేతలు ఎంతగానో ప్రయత్నించినా అధిష్టానం పట్టించుకోలేదు. జగిత్యాల జిల్లాకు చెందిన సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించింది. ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీగా కొనసాగుతోన్న జీవన్‌రెడ్డికే టికెట్ కేటాయించడంతో పార్టీలోని బీసీ వర్గాల నేతలంతా మండిపడుతున్నారు. నిజామాబాద్ లోక్‌సభ నీటు కోసం మున్నూరుకాపులు, పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన నేతలు చివరిదాకా పోటీ పడ్డారు. ఏఐసీసీ, పీసీసీ పెద్దలకు వినతులు సమర్పించారు. కానీ వీరిని పట్టించుకున్న వారే లేరు.

నిజామాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

మొన్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ వెనుకబడిన వర్గాలకు ద్రోహం చేసిందన్న అపవాదు ఉంది. తాజాగా లోక్‌సభ టికెట్ సైతం అగ్రవర్ణాలకే కేటాయించిన కాంగ్రెస్ అధిష్టానంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటనలు చేసే కాంగ్రెస్ పార్టీ ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రెండు వారాలకు అభ్యర్థిని ప్రకటించిన హస్తం పార్టీ.. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో అన్ని వర్గాల మద్దతు కూడగట్టడం కష్టమేననే వాదన వినిపిస్తున్నది.

ఆసక్తికర పోరు...

నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రధాన పార్టీల తరఫున పోటీ చేసేదేవరో తేలిపోయింది. బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్ బరిలోకి దిగుతున్నారు. ఈ ముగ్గురు గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన వారే కావడం ప్రాధాన్యత సంతరించుకున్నది. జగిత్యాలలో జీవన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో బాజిరెడ్డి గోవర్ధన్, కోరుట్లలో పోటీ చేసిన అర్వింద్ ధర్మపురి పరాజయం చెందారు. ఓడిన ఈ ముగ్గురు ఇప్పుడు నేరుగా తలపడుతుండడం ఆసక్తి రేపుతున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలకు వచ్చిన ఓట్ల లెక్కల ప్రకారం బీఆర్ఎస్ ముందుంది. నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడుచోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. సీనియర్ రాజకీయ నాయకుడిగా బాజిరెడ్డి గోవర్ధన్‌కు జనాల్లో మంచి పేరుంది. తన సామాజిక వర్గమైన మున్నూరుకాపుల బలం నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో అధికంగా ఉన్నది. మాస్ లీడర్‌గా గుర్తింపు పొందిన బాజిరెడ్డి ఇప్పటికే విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. విజయ అవకాశాలు బీఆర్ఎస్ వైపే ఉన్నట్లు పలు సర్వేలు వెల్లడిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంతో పని చేస్తున్నాయి. జహీరాబాద్ నియోజకవర్గంలోనూ బీసీ నేతకే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ టికెట్ ఇచ్చారు. గాలి అనిల్‌కుమార్‌కు అవకాశం కల్పించగా, ఆయన ప్రచార కార్యక్రమాల్లో జోరుగా పాల్గొంటున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీకి సిట్టింగ్ స్థానం కావడంతో గెలుపే ధ్యేయంగా గులాబీ శ్రేణులు పాటుపడుతున్నారు.

ఆస్తి కోసం అమానవీయం

- అనారోగ్యంతో వృద్ధురాలి మృతి
- ఆస్తి కోసం బంధువుల వీరంగం
- మృతదేహం ఎదుటే ఘర్షణకు దిగిన వైనం
- చనిపోయిన 36 గంటల తర్వాత అంత్యక్రియలు
- రామారెడ్డి మండలం ఇసన్నపల్లిలో ఘటన

కిష్టవ్వ మృతదేహాన్ని గురువారం రాత్రి దహన సంస్కారాలకు తీసుకెళ్తున్న కులస్తులు

రామారెడ్డి, మార్చి 28: వారసులు లేని వృద్ధురాలు మరణిస్తే ఆమెకు గౌరవంగా వీడ్కోలు పలకాల్సిన బంధువులు అమానవీయంగా ప్రవర్తించారు. వృద్ధురాలి ఆస్తి కోసం మృతదేహం ఎదుటే ఘర్షణకు దిగారు. ఆస్తి తమదంటే తమదని పరస్పరం దాడులు చేసుకున్నారు. బుధవారం మధ్యాహ్నం చనిపోతే, గురువారం రాత్రి దాకా అంత్యక్రియలు చేయకుండా పంపకాల కోసం కొట్లాటకు దిగారు. రామారెడ్డి మండలం ఇసన్నపల్లిలో ఈ దారుణ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఇసన్నపల్లికి చెందిన చింతల కిష్టవ్వ (55)కు వారసులు లేరు. ఆమెకు గ్రామంలో 40 గుంటల భూమి, ఇల్లు ఉంది. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న కిష్టవ్వ బుధవారం మధ్యాహ్నం మృతి చెందింది. అయితే, దహన సంస్కారాలు నిర్వహించాల్సిన బంధువులు ఆస్తి కోసం తగువులాటకు దిగారు. కిష్టవ్వ అనారోగ్యంతో ఉంటే మేమే సపర్యలు చేశామని, అంత్యక్రియలు తామే చేస్తామని ఆమె చెల్లెలి కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. అయితే, తమకు రూ.2 లక్షలు ఇస్తేనే దహన సంస్కారాలు చేయనిస్తామని కిష్టవ్వ మరిది చింతల మైసయ్య, ఆయన భార్య, కొడుకులు పట్టుబట్టారు. గురువారం ఉదయం మొదలైన ఈ గొడవ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. వాగ్వాదం చేసుకున్న రెండు కుటుంబాల వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో మైసయ్య కుమారుడు రవీందర్ తల్వార్ తీసుకొచ్చి.. మృతురాలి చెల్లెలి కొడుకు అయిన రాజంపేట మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అప్పరబోయిన నర్సింహులుపై దాడి చేశాడు. ఈ దాడి నుంచి తప్పించుకునే క్రమంలో నర్సింహులు చేతి మూడు వేళ్లు తెగిపోయాయి. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. ఆస్తుల గొడవ తర్వాత చూసుకోవచ్చని, ముందు అంత్యక్రియలు జరిపించాలని పోలీసులు, కులస్తులు సర్దిప్పడంతో ఇరువర్గాల వారు శాంతించారు. చివరికి గురువారం రాత్రి కిష్టవ్వ దహన సంస్కారాలు పూర్తి చేశారు.

దేశీ'దారులకు' అడ్డుకట్టేది?

పక్కరాష్ట్రమైన మహారాష్ట్రలోని దేశీదారు మద్యం కామారెడ్డి జిల్లాలో విచ్చలవిడిగా ప్రవహిస్తోంది. జిల్లాలోని పలుచోట్ల డంప్ చేసినట్లు తెలుస్తోంది. ఇంతజరుగుతున్నా తమకేమీ పట్టనట్లుగా ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నది.

-నిజామాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- కామారెడ్డి జిల్లాలో విచ్చలవిడిగా విక్రయాలు
- ఎన్నికల వేళ అప్రమత్తత కరువు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు
- బాన్సువాడలోని ఓ బార్‌పై ఫిర్యాదులు
- తూతూ మంత్రంగానే విచారణతో సమాప్తం
- అధికార పార్టీ నేతల జోక్యంతో చర్యలు శూన్యం

సరిహద్దు ప్రాంతమైన జుక్కల్, బాన్సువాడలో దేశీదారు విక్రయాలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ సంబంధిత అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారం రోజుల క్రితం బాన్సువాడలోని ఓ బార్‌లో హైదరాబాద్ వైన్ షాపునకు చెందిన ఓ మద్యం బాటిల్ బయట పడింది. నిబంధనల మేరకు ఏ ప్రాంతానికి కేటాయించిన బాటిళ్లను అక్కడే విక్రయించాలి. ఒక మద్యం షాపులో డంప్ చేసిన సరుకును ఇతర దుకాణాల్లో విక్రయించడం ఎక్సైజ్ చట్టం ప్రకారం నేరంగా పరిగణిస్తారు. ఈ వ్యవహారంపై కొంతమంది ఫిర్యాదులు చేసినప్పటికీ కంటితుడుపు చర్యగానే ఎక్సైజ్ శాఖ కొట్టి పారేసినట్లుగా తెలుస్తోంది. వెరిట్ యాప్ ద్వారా బాటిల్ సమాచారాన్ని గుర్తించినప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా చేతులు ఎత్తేయడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారం వెనుక బాన్సువాడకు చెందిన ఓ అధికార పార్టీ నేత ఒత్తిడి ఉన్నట్లుగా తెలుస్తోంది. అందుకే చర్యలకు ఆబ్కారీ శాఖ వెనుకాడుతుండడం అక్రమార్కులకే వంత పాడుతున్నట్లు సమాచారం.

గోల్‌మాల్

బాన్సువాడలో లైసెన్స్‌డ్ బార్ నడుపుతున్న ఓ రాజకీయ నాయకుడి తీరు తీవ్ర వివాదస్పదమవుతున్నది. ఈ మధ్యనే అధికార పార్టీ తీర్థం పుచ్చుకున్న సదరు నాయకుడు తనను అడిగే వారెవ్వరూ అన్నట్లుగా ఇష్టారాజ్యంగా సమయపాలన పాటించకుండా బార్‌ను నడుపుతున్నా ఎక్సైజ్ శాఖ పట్టనట్లుగా వ్యవహరించడం గమనార్హం. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు ఇచ్చినప్పటికీ అధికార పార్టీ నేతల జోక్యం మూలంగా సమయ పాలన మించినప్పటికీ పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఎక్సైజ్ శాఖతో పాటు పోలీసులు సైతం వంత పాడి అక్రమార్కులకు సహకారం అందిస్తున్నట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా నడిచే మద్యం షాపుల తీరుపై ఎస్పీ సింధూ శర్మ సీరియస్‌గా ఉన్నప్పటికీ కింది స్థాయిలో మాత్రం పోలీసుల పాత్ర పలు అనుమానాలకు తావిస్తోంది. ఇందుకు బాన్సువాడలోని వైన్ షాపులు, బార్ నిర్వహణ తీరే నిదర్శనంగా నిలుస్తోంది. లోక్‌సభ ఎన్నికలు సమీపించడంతో మద్యం ఏరులై పారడం సర్వసాధారణం. ఇందులో ఆయా రాజకీయ పార్టీలు మద్యాన్ని పంపిణీ చేసేందుకు భారీగా ఏర్పాట్లు చేసుకుంటున్నది. తక్కువ ఖర్చుతో మద్యం పంపిణీ చేసి చేతులు దులుపుకోవాలని కొంత మంది ఆలోచన చేస్తుండగా వీరంతా దేశీదారు మద్యంపై ఆధారపడినట్లు అర్థమవుతోంది. తెలంగాణ సర్కారు ద్వారా కొనుగోలు చేసే మద్యం ఖర్చుతో అంతకు రెండింతలు దేశీదారు కొనుగోలు చేయవచ్చనే కుటిలఆలోచనలతో చాలా మంది ఈ ప్రయత్నాలకు ఒడిగడుతున్నట్లు సమాచారం. ఇందుకు ఎక్సైజ్ శాఖకు చెందిన వారే సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దేశీదారు జోరు...

మద్యం దుకాణాల్లో గుట్టుగా ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం అమ్మకాలు సైతం జరుగుతున్నాయని మద్యంప్రియులు ఆరోపిస్తున్నారు. మన రాష్ట్రంలో లభించే చీప్ లిక్కర్ ధర కన్నా మహారాష్ట్రలోని దేశీదారు తక్కువకు లభిస్తుండడంతో అక్కడి నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. దీనిపై ఎక్సైజ్ శాఖకు సమాచారం ఉన్నప్పటికీ తనిఖీలు, దాడులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో విచ్చలవిడిగా దేశీదారు ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. గతంలో దేశీదారుపై కేసీఆర్ సర్కారు ఉక్కుపాదం మోపి అడ్డుకట్ట వేసింది. ప్రస్తుతం తెర వెనుక కొంత మంది వ్యక్తులు అంతా తామై వ్యవహరిస్తూ దేశీదారుకు దారులు తెరిచినట్లుగా స్పష్టం అవుతోంది. మద్నూర్, జుక్కల్, పెద్దకొడప్‌గల్, పిట్లం, బిచ్కుంద, బీర్కూర్, బాన్సువాడ, నస్రుల్లాబాద్ మండలాల్లో దేశీదారు వెలుగు చూస్తున్నట్లు తెలుస్తోంది. నిఘా వైఫల్యం మూలంగా దేశీదారుతో స్థానిక ప్రజానీకం ఒళ్లును గుల్ల చేసుకుంటోంది. దేశీదారు తాగితే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. నాణ్యత ఉండకపోవడంతో మద్యం ప్రియుల ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలున్నాయి. కానీ తమ జేబులు నింపుకునేందుకు ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి ఎక్సైజ్ శాఖ వ్యవహరిస్తుండడం విడ్డూరంగా మారింది.

కర్ణాటకలో జిల్లావాసుల బలవన్మరణం

రాజు, స్వాతి (ఫైల్)

కొడగు జిల్లా సోమవార్‌పేట్ పరిధిలోని ఓ లాడ్జిలో జనవరి 4న గదిని అద్దెకు తీసుకున్నారు. బస చేసిన వారు రెండు రోజులుగా గదిలో నుంచి బయటికి రాకపోవడంతో లాడ్జి నిర్వాహకులకు అనుమానం వచ్చి గదిలోకి చూడగా దుర్వాసన వచ్చింది. దీంతో వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సోమవార్ పేట్ ఎస్సై రమేశ్‌కుమార్ లాడ్జికి వెళ్లి గది తలుపులను తెరిపించి చూడగా దంపతులిద్దరూ నైలాన్ తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాలను స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేశారు.

వినాయక్‌నగర్, మార్చి 28: నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన దంపతులు కర్ణాటక రాష్ట్రం కొడగు జిల్లా సోమవార్‌పేట్ పరిధిలోని ఓ లాడ్జిలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన గురువారం వెలుగుచూసింది. నిజామాబాద్ నగరంలోని గాయత్రీనగర్ ప్రాంతానికి చెందిన మేడవరపు రాజు (55), మేడవరపు స్వాతి(53) దంపతులు కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నట్లు స్థానికులు తెలిపారు. కొన్ని నెలల క్రితం భార్యాభర్తలు కర్ణాటక రాష్ట్రానికి వెళ్లారు. అక్కడ

రైలు కిందపడి ఇద్దరి ఆత్మహత్య

బాసర రైల్వేస్టేషన్ వద్ద ఘటన

మృతులు జిల్లావాసులుగా గుర్తింపు

వినాయక్‌నగర్, మార్చి 28: నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు, మరో యువతి నిర్మల్ జిల్లా పరిధిలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన బాసర రైల్వే స్టేషన్ వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన మేరకు వివరాలు.. నగరంలోని కోటగల్లికి చెందిన సూరం శ్రీకాంత్ (28) స్థానిక వినాయక్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నాడు. సీతారాంనగర్ కాలనీకి చెందిన నందిత(20) ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ (ద్వితీయ) చదువుతోంది. వీరిద్దరూ కలిసి బుధవారం రాత్రి బాసర రైల్వేస్టేషన్‌లోని ఓ ఫ్లాట్‌ఫాం మీద కూర్చొని ఉన్నారు. నర్సాపూర్-నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైలు బాసర స్టేషన్‌కు చేరుకోగానే ఇద్దరు రైల్వే ట్రాక్‌పై దూకేశారు. విషయం తెలుసుకున్న నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి, సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. మృతిచెందిన వారి వద్ద ఉన్న ఆధారాలను సేకరించి వారి కుటుంబీకులకు సమాచారం అందజేశారు. గురువారం ఇద్దరి కుటుంబ సభ్యులు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.

శ్రీకాంత్ (ఫైల్), నందిత (ఫైల్)